క్లుప్తంగా

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన మధుమతిరెడ్డి



ఎంపీ మిథున్‌రెడ్డితో చౌళూరు మధుమతిరెడ్డి తదితరులు

చిలమత్తూరు: ఎంపీ మిథున్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి గన్నవరం విమానాశ్రయంలో మంగళవారం కలిశారు. ఆయనతో పాటు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కూడా మాట్లాడారు. అనంతరం మధుమతిరెడ్డి మాట్లాడుతూ అక్రమ కేసులు కేవలం వేధించడానికే ఉపయోగపడతాయని, అయినా అవేవీ ఎంపీ మిథున్‌రెడ్డిని ఏమీ చేయలేక పోయాయని పేర్కొన్నారు. త్వరలోనే అక్రమ కేసు బయటపడుతుందన్నారు.

పెంకాక్ సిలాట్ పోటీల్లో ప్రతిభ



పెంకాక్ సిలాట్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

హిందూపురం: కర్ణాటకలోని కొప్పల్ పట్టణంలో జరిగిన 13వ జాతీయస్థాయి సింగ, మకాన్, ప్రీటీన్, ప్రీ జూనియర్, జూనియర్ పెంకాక్ సిలాట్ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన యువతీ, యువకులు పాల్గొని ప్రతిభ చూపినట్లు ఏపీ పెంకాక్ సిలాట్ సీఈఓ పి.మనోజ్ సాయి తెలిపారు. జిల్లా నుంచి పాల్గొన్న క్రీడాకారులు ప్రీటీన్ విభాగంలో తనీశ్వర్‌రెడ్డి బంగారు పతకం, జూనియర్ ట్యాండింగ్ విభాగంలో మదిహ భాను సిల్వర్ మెడల్, సింగ ట్యాండింగ్ కేటగిరిలో అఫీఫా కౌసర్ బ్రౌంజ్ మెడల్ సాధించారన్నారు. పోటీలకు సెక్రటరీగా భరద్వాజ్‌రెడ్డి, కోశాధికారిగా జనార్దన్‌రెడ్డి, పి రఫీక్ అహ్మద్, కోచ్‌లు రియాజ్ బాషా, ప్రవీణ్ కుమార్ వ్యవహరించారన్నారు.

దేశానికి రక్షణగా నిలవాలి



విన్యాసాలు చేస్తున్న స్వయం సేవకులు

అమరాపురం: ప్రతి ఒక్కరూ దేశానికి రక్షణగా నిలవాలని రాష్ట్రీయ స్వయం సేవక్ ప్రతినిధులు వివేకానంద, లింగేష్, నాగభూషణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సరస్వతీ విద్యామందిరంలో రాష్ట్రీయ స్వయం సేవక సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వయం సేవకులకు వారం రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ముగింపు సమావేశంలో శిక్షణలో నేర్చుకున్న కరాటే, దండ తిరుగుడు తదితర వాటిని మరోసారి గుర్తు చేసుకున్నారు. వక్తలు మాట్లాడుతూ నాడు స్వామి వివేకానంద, రామకృష్ణ పరమహంస, రాజారామ్మోహన్‌రాయ్ తదితరులు సంస్థలను స్థాపించి హిందులకు రక్షణగా నిలబడ్డారన్నారు. మనం కూడ దేశం కోసం, ధర్మం కోసం పని చేయాలని సూచించారు.

పాడి పరిశ్రమకు అధిక ప్రాధాన్యత



ఎమ్మెల్యే వెంకటేశ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: వీఎస్ఎస్ఎన్ సహకార సంఘాలు మెరుగైన సేవలందిస్తున్నాయని, వ్యవసాయ పనులకు, వ్యాపారాలకు, పాడి పరిశ్రమ అభివృద్ధికి రుణాలందించి ఆర్థికాభివృద్ధికి ఎంతో పాటు పడుతున్నాయని తుమకూరు జిల్లా తుముల్ అధ్యక్షుడు, డీసీసీ బ్యాంకు డైరెక్టర్ పదవులను చేపట్టిన స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ కొనియాడారు. స్థానిక డీసీసీ బ్యాంకు ఆవరణలో మంగళవారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాడి పరిశ్రమ అభివృద్ధి లో భాగంగా ఆవుల కొనుగోలుకు డీసీసీ బ్యాంకు నుంచి పాడి రైతులకు రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పీఎల్‌డీ బ్యాంక్ అధ్యక్షుడు శేషగిరి, నరసింహయ్య, శంకరరెడ్డి, సేవానాయక్, నాగభూషణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలోకి వెళ్తే చర్యలు తప్పవు

రొద్దం: మండల పరిధిలోని గౌరాజుపల్లిలో ఉన్న 35 సెంట్ల ప్రభుత్వ స్థలంలోకి వెళ్లి ఎవరైనా విగ్రహాలు, ఇతర పనులు ప్రారంభిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ నరేంద్ర తెలిపారు. గ్రామంలో ఉన్న ఖాళీ స్థలంలో రజకులు దోబీఘాట్, వాల్మీకులు వాల్మీకి విగ్రహం, దళితులు మరొకటి చేయాలని మూడు వర్గాల వారు ప్రయత్నించటంతో గ్రామంలో శాంతి భద్రతల సమస్య ఏర్పడుతోందన్నారు. దీంతో అక్కడున్న ప్రభుత్వ స్థలంలోకి ఎవరు వెళ్లినా 145 సీఆర్‌పీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామన్నారు.



హైవేపై ట్రాక్టర్‌లో తరలిపోతున్న కలప

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

లేపాక్షి: మండలంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా కొందరు యథేచ్ఛగా అక్రమంగా కలపను రవాణా చేస్తున్నారు. అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో రోజూ ట్రాక్టర్లలో కలప అక్రమ రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని ఏళ్లనాటి వృక్షాలను నరికి వేసి పర్యావరణానికి ముప్పు వాటిల్లే విధంగా వ్యవహరిస్తున్నారు. సంవత్సరాలుగా చెరువుల్లోను, గ్రామాల్లో ఉన్న తుమ్మ చెట్లతో పాటు ఇతర చెట్లను నరికేస్తున్నారని ఆయా ప్రాంతాల్లో స్థానికులు చెబుతున్నారు. జాతీయ రహదారిపైనే వివిధ వాహనాల్లో కలప తరలిపోతున్నా ఎవరూపట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పర్యావరణ పరిరక్షణ కోసం చెట్లు నరకకుండా చూడాల్సిన అవసరం ఉంది.

స్మార్ట్ కార్డుల కోసం తిప్పలు

పెనుకొండ: ప్రభుత్వం పంపిణీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కొత్త స్మార్ట్ రేషన్ కార్డు ఎలా ఉంటుందో అని తపనతో ముందుగా తీసుకోవాలని లబ్ధిదారులు సచివాలయాల వద్దకు పరుగులు తీస్తున్నారు. అయితే తీరా అక్కడికి వెళ్లిన తర్వాత మీ రేషన్ కార్డు ఈ సచివాలయంలో లేదు.. మరో సచివాలయానికి వెళ్లాలని చెబుతుండటంతో ఇబ్బంది పడుతున్నారు. మరో కార్యాలయానికి వెళ్లినా అక్కడ కూడా కార్డు లేదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు లబ్ధిదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని స్మార్ట్ రేషన్ కార్డులను డీలర్ల వద్దే తీసుకునే వెలుసుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలకు అందుబాటులో సచివాలయాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.





అమరాపురంలో పూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

పూల ధరకు రెక్కలు

అమరాపురం: దసరా ఉత్సవాల్లో భాగంగా పూలు, పండ్లకు రెక్కలు వచ్చాయి. మంగళవారం ఉదయం అమరాపురంలోని టీటీడీ కళ్యాణ మంటపం ముందు ఏర్పాటు చేసిన పూల మార్కెట్లో పూలు కొనుగోలు చేయడానికి వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. అయితే పూలు ధరలు ఆకాశాన్నంటాయి. చామంతి కేజీ రూ.100, బంతి రూ.60, కాకడ రూ.200, మల్లె రూ.180, కనకాంబరం రూ.15లు ధర పలికాయి. అదేవిధంగా అరటి పండ్లు యాలక్కి రకం కేజీ రూ.80, యాపిల్ కేజీ రూ.150, నారింజ కేజీ రూ.80 పలికాయి. దీంతో ప్రజలు అవసరమేరకు మాత్రమే కొనుగోలు చేశారు.

మిథున్‌రెడ్డికి బెయిల్ రావడం హర్షణీయం



స్వీట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి



బాబయ్య దర్గాలో చాదర్ సమర్పిస్తున్న షేక్‌బాబా సలాం

మడకశిర: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం నమోదు చేసిన లిక్కర్ కేసు పూర్తిగా అక్రమమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. మిథున్‌రెడ్డికి ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో మంగళవారం మడకశిరలో వైసీ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంపిణీ చేశారు. గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై కక్ష గట్టిందని తెలిపారు. చంద్రబాబు కావాలనే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని వేధిస్తున్నారన్నారు. జరగని లిక్కర్ స్కాంను కూటమి ప్రభుత్వం సృష్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామిరెడ్డి, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి శ్రీరాములు, రొళ్ల ఎంపీపీ విజయరంగేగౌడ్, స్థానిక నాయకులు వెంకటరంగారెడ్డి, నాగభూషన్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, దొడ్డయ్య, సురంగల నాగరాజు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరాపురం: ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గం ఎస్సీ, బీసీ సెల్ అధ్యక్షులు శివన్న, శివకుమార్ హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఎంపీపీ ఈరన్న, వైస్.ఎంపీపీలు కృష్ణమూర్తి, రంజిత్ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ తదితరులు మిథున్‌రెడ్డికి బెయిల్ రావడం సంతోషకరమన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ పటిష్టతకు ఎనలేని కృషి చేస్తున్నారని, అలాంటి వ్యక్తిని దురుద్దేశంతో కేసులో ఇరికించాలని పన్నాగం పన్నారని విమర్శించారు. అయితే దుర్గాష్టమి రోజున దుర్గాపరమేశ్వరి అనుగ్రహంతో బెయిల్ మంజూరు కావడంతో విడుదలయ్యారన్నారు.

ఎంపీకి బెయిల్ రావడంతో దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

పెనుకొండ: ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ వచ్చిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్‌బాబా సలామ్ పట్టణంలోని బాబయ్యదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారి సమాధికి చాదర్ సమర్పించారు. మద్యం కేసులో ఎలాంటి వాస్తవాలు లేకున్నా అక్రమంగా మిథున్‌రెడ్డి అరెస్టు చేశారన్నారు. కేవలం కక్ష సాధింపు చర్యలో భాగంగానే అరెస్టు చేశారని విమర్శించారు.

పదవీ విరమణ ఉద్యోగికి సన్మానం



బ్రహ్మానందరెడ్డి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

మడకశిర: స్థానిక ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న డిప్యూటీ ట్రాఫిక్ ఇన్‌చార్జ్ బ్రహ్మానందరెడ్డి మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా డిపోలో ఆయనకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆర్టీసీ డీఎం రంగభాష్యం మాట్లాడుతూ విధి నిర్వహణలో బ్రహ్మానందరెడ్డి ఎంతో మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. ఆర్టీసీ సిబ్బంది అయన్ను ఆదర్శంగా తీసుకుని పని చేయాలని సూచించారు. డిపో ఆదాయాన్ని పెంచడానికి అయన చేసిన కృషి మరువలేనిదన్నారు. విధి నిర్వహణలో తనకు సహాయ సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ బ్రహ్మానందరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బ్రహ్మానందరెడ్డి దంపతులను డీఎం, ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

వివిధ పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి

మడకశిర: మండలంలోని టీడీపీ, కాంగ్రెస్ తదితర పార్టీలకు చెందిన పలువురు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, మండల కన్వీనర్ రామిరెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కోడిపల్లికి చెందిన నరేష్‌తో పాటు పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారు మట్లాడుతూ పేదలకు పూర్తిస్థాయిలో సంక్షేమం అందాలంటే వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉంటేనే సాధ్యమవుతుందన్నారు. మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్షతోనే వైఎస్సార్‌సీపీలో చేరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామిరెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు, ఎంపీపీ విజయరంగేగౌడ్, స్థానిక నాయకులు బాలకృష్ణారెడ్డి, నరసింహారాజు, అశ్వర్థప్ప, నారాయణప్ప, రంగనాథ్, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవీ నమోస్తుతే !

సాక్షిబృందం: శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో మంగళవారం ఉదయం నుంచే అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించే భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.



హిందూపురం: కనకదుర్గగా యల్లమ్మ



పరిగి: దుర్గాదేవిగా సప్తమాతృక అమ్మవారు



అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి



పెనుకొండ: దుర్గమ్మగా వాసవీమాత



పూసల అలంకరణలో వీరకేతమ్మ



లేపాక్షి: అలంకరణలో దుర్గమ్మ

బాధిత కుటుంబానికి పరామర్శ



సద్దాం హుస్సేన్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

గుడిబండ: మండల పరిధిలోని ఎస్ రాయాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇస్మాయిల్ రెండో కుమారుడు సద్దాం హుస్సేన్ (34) అగళి మండలంలోని హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులు మంగళవారం సాయంత్రం ఎస్ రాయపురం గ్రామం చేరుకుని సద్దాం హుస్సేన్ మృత దేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అధైర్య పడొద్దని, అండగా ఉంటామన్నారు. ఈరలక్కప్ప వెంట సర్పంచులు కరుణాకర్ గౌడు, హులిరాజు, కవితట బన్న, నాయకులు రామకృష్ణ, ఎస్ఎస్ గుండ్లు రాజు, నాగరాజు, ఫణీంద్ర, రాయుడు, ఈరన్న, నజీర్, ఇర్ఫాన్ తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో చండీయాగం



బాలికా పూజ నిర్వహిస్తున్న దృశ్యం



హోమ పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

హిందూపురం: చౌడేశ్వరీ విరూపాక్షస్వామి ఆలయంలో దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం చండీ యాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా ఆలయంలో చౌడేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు చేసి మంగళ హారతిచ్చారు. హోమాలు చేసి పూర్ణాహుతి చేసి పూజలు చేశారు. శరన్నవరాత్రుల్లో చండీ హోమం చేయడంతో సర్వ దుష్ట, నష్ట, కష్టాలు హరిస్తాయన్నారు. తర్వాత దేవి స్వరూపమైన బాలికలకు పూజలు చేసి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా పండితులు నవీన్ శర్మ మాట్లాడుతూ భక్తిభావంతో పూజలు చేయడంతో మంచి ఆలోచనలు, మనస్సు ప్రశాంతంగా ఉండి అంతా శుభం జరుగుతుందన్నారు.

లేపాక్షిలో పర్యాటకుల సందడి



దుర్గాదేవి ఆలయంలో పర్యాటకుల సందడి

లేపాక్షి: పర్యాటక కేంద్రమైన లేపాక్షి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. వీరభద్ర స్వామి, దుర్గాదేవి అమ్మవార్లను భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు లేపాక్షి గ్రామానికి చెందిన జయరామప్ప వారి కుటుంబ సభ్యులు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

రొద్దం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 90 రోజుల ఉచిత శిక్షణ తరగతులను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని రొద్దం, పెనుకొండ మండలాల జాబ్స్ కోఆర్డినేటర్ లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ చదివిన వారు అర్హులన్నారు. 90 రోజుల పాటు ఉచిత వసతి, భోజన సదుపాయం, యూనిఫాం సౌకర్యం కల్పిస్తామన్నారు. కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ కోర్సులో అనుభవజ్ఞులైన అధ్యాపకుల ద్వారా శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్‌తో పాటు ప్రముఖ ప్రైవేట్ సంస్థలలో కచ్చితంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. అనంతపురం టీటీడీసీ ట్రైనింగ్ సెంటర్‌లో అక్టోబర్ 3 నుంచి శిక్షణ ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న సీఐ నగేష్

మడకశిర: పౌరహక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అర్బన్ సీఐ నగేష్ సూచించారు. మంగళవారం పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పౌరహక్కులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని కోరారు. హక్కులతో పాటు బాధ్యతలను కూడా పౌరులు గుర్తించాలన్నారు. ప్రధానంగా శాంతిభద్రతలను కాపాడడంలో ప్రజలు కూడా కీలక పాత్ర పోషించాలన్నారు.

మడకశిరలో ఎమ్మెల్యే పర్యటన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంఎస్ రాజు

మడకశిర: స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మంగళవారం పట్టణంలో పర్యటించారు. అంబేడ్కర్ సర్కిల్, హిందూపురం రోడ్డు, పాత కర్ణాటక బ్యాంక్ వద్ద జరుగుతున్న బ్రిడ్జీలు, డ్రైనేజీ పనులను పరిశీలించారు. పాత సంత మార్కెట్‌లో నిరుపయోగంగా ఉన్న గదులు, మున్సిపల్ స్థలాన్ని పరిశీలించారు. మధుగిరి సర్కిల్‌లో డ్రైనేజీ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. చిరు వ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకు మునుపు తన కార్యాలయంలో అమరాపురం మండల దళిత నాయకులతో సమావేశమయ్యారు.

ధన్వంతరి జయంతిని అధికారికంగా నిర్వహించాలి

పెనుకొండ: నాయీ బ్రాహ్మణుల కులదైవమైన ధన్వంతరి జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నాయీ బ్రాహ్మణుల ఉద్యోగుల సంఘం నాయకులు మంత్రి సవితను కోరారు. పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో వారు మంగళవారం సవితను కలిశారు. రాష్ట్రంలో నాయీ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. వారి అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా తమ కులదైవమైన ధన్వంతరి జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించాలన్నారు. గౌరవాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడు వెంకటరంగయ్య, కార్యదర్శి శివశంకర్, శివప్రసాద్, ఉమామహేశ్వరి, నాగరాజు, విజయనగరం నాగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శంకర్

హిందూపురం: ఏపీ మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా హిందూపురం మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ శంకర్‌ను నియమించినట్లు రాష్ట్ర ఎంఈఎఫ్ ప్రెసిడెంట్ దేవరపల్లి బిక్షలు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఎఫ్ నాయకుడు రామకృష్ణ నియామక పత్రాలను శంకర్‌కు అందించారు. ఎంఈఎఫ్ అభివృద్ధి, ఉద్యోగులకు అందుబాటులో ఉండి వారి అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని శంకర్ తెలిపారు.

కార్మికులు కష్టపడి పని చేయాలి



మాట్లాడుతున్న ఆర్టీసీ డిపో మేనేజర్

మడకశిర: మడకశిర ఆర్టీసీ డిపో అభివృద్ధికి కార్మికులు కష్టపడి పని చేయాలని డిపో మేనేజర్ రంగభాష్యం సూచించారు. ఆయన మంగళవారం ఆర్టీసీ కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. స్త్రీశక్తి పథకం అమలు తీరుపై కార్మికులను అడిగి తెలుసుకున్నారు. డీఎం మట్లాడుతూ ఆర్టీసీ డిపోకు కార్మికులు మంచి పేరు తీసుకుని రావాలని కోరారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని కోరారు. సమావేశంలో ఈయూ అధ్యక్షుడు రఫిక్, రీజనల్ కార్యదర్శి నరసింహులు, ఎన్ఎంయూ కార్యదర్శి కరియప్ప, డిపో నాయకులు పురుషోత్తం, జయసింహ, అజీజ్, గోపాల్, నాయుడు, ఈశ్వరప్ప, కేటీస్వామి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ



ఈశ్వర్‌ను పరామర్శిస్తున్న ఉషశ్రీచరణ్

పరిగి: మండలంలోని మోదా గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు అయినా ఈశ్వర్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి, ఉషశ్రీచరణ్ మంగళవారం పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో డాక్టర్ ఈశ్వర్ గాయపడ్డారు. హిందూపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఉషశ్రీచరణ్ అక్కడికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఆమె వెంటమండల కన్వీనర్ నరసింహమూర్తి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

నిరసన విజయవంతం

మడకశిర: కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తూ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం హిందూపురంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమం విజయవంతమైందని ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింమమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేశారన్నారు. మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప, హిందూపురం నేత వేణురెడ్డి తదితరులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారనడానికి నిరసన కార్యక్రమం విజయవంతం కావడమే నిదర్శనమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఈవిషయాన్ని గుర్తించి ప్రైవేటీకరణను ఆపాలని కోరారు. లేకపోతే ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.